క్లుప్తంగా

పాదగయను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



కుక్కుటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

పిఠాపురం: స్థానిక పాదయగ క్షేత్రాన్ని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖరరావు దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ, అధికారులు స్వాగతం పలికారు. పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి, శక్తి పీఠాలలో ఒకటైన పురుహితికా దేవి అమ్మవారిని, దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను వివరించారు.

మదుగులమ్మ సన్నిధిలో అన్నసమారాధన



మదుగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురంలో వేంచేసి ఉన్న మదుగులమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఆదివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చల్లా బుజ్జి, పుప్పాల నాయుడు, మార్ని రాజు, కోట వెంకన్న, పుప్పాల శ్రీను, మార్ని వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



పెద్దాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పెద్దాపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ మృతుల సంస్మరణార్థం దీప స్మృత్యంజలి కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం మెడికల్ ఆఫీసర్ సతీష్‌చంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు బి.దుర్గేశ్వరి, ఆర్.జయ, డి.రాజు, ఆస్పత్రి సిబ్బంది ఉషా, నిర్మల, పి.సుగంధి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో చాణక్య ప్రతిభ



ప్రశంసాపత్రంతో చాణక్య

సామర్లకోట: ఇటీవల పాలకొల్లులో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సామర్లకోటకు చెందిన ఎస్.చాణక్య ప్రతిభ కనబర్చాడు. దీంతో జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు బాస్కెట్ బాల్ కోచ్ ఐ.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో గోపాలకృష్ణ విద్యార్థులకు ఉచితంగా బాస్కెట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నారు. ఆయన శిక్షణతో జిల్లా జట్టులో ఎంపిక కావడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని చాణక్య తెలిపారు. విజేతను గోపాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్సై సునీత హెచ్చరించారు. ఆదివారం రాత్రి స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహన డ్రైవర్లను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ఇటీవల కాలంలో ప్రమాదాలు ఎక్కువ సంభవించడంతో పాటు ఎక్కువ మంది చనిపోతున్నారని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సామర్లకోట పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏఎస్సై సింహాద్రి, హెచ్‌సీ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్షక భటులు వస్తున్నారండోయ్..

- సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు అదనపు సిబ్బంది
- పరిధి పెరగడంతో ఇబ్బంది లేకుండా చర్యలు
- రూరల్ స్టేషన్ ఏర్పాటుకూ కసరత్తు



సామర్లకోట పోలీస్ స్టేషన్

సామర్లకోట: పరిధి పెరిగింది.. మూడింతల పని వచ్చింది.. అయినా అదే సిబ్బందితో ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రజల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతోంది.. మండలమంతా ఒకే పోలీసు స్టేషన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం మేరకు సామర్లకోట మున్సిపాలిటీ, మండలంలోని 18 గ్రామాలను పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోకి తీసుకు వచ్చారు. గతంలో సామర్లకోటతో పాటు పీబీ దేవం, జి.మేడపాడు, జి.కొత్తూరు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, కాపవరం, చంద్రంపాలెం గ్రామాలు సామర్లకోట పోలీసు స్టేషన్ పరిధిలో ఉండేవి. అదేవిధంగా వీకే రాయపురం, బోయనపూడి, మాధవపట్నం గ్రామాలు ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోకి, పనసపాడు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర, ఉండూరు గ్రామాలు తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉండేవి. ఇప్పుడు ఇవన్నీ సామర్లకోటలో కలిశాయి.

అప్పటి నుంచి ఇప్పటి వరకూ..

కాకినాడ సర్కిల్‌లో ఉండే సామర్లకోట పోలీస్ స్టేషన్ 1960లో పెద్దాపురం డివిజన్‌లో కలిసింది. ప్రారంభంలో పిఠాపురం రోడ్డులో పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీస్ స్టేషన్ ఉండేది. పోలీస్ క్వార్టర్స్ వద్ద స్టేషన్ ఉండాలనే నిర్ణయం మేరకు 1992 కోట్లమ్మ చెరువు వద్ద నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని అప్పటి ఎస్పీ సీయస్ గోపీనాథ్ రెడ్డి ప్రారంభించారు. అప్పట్లో 37 మంది పోలీసు సిబ్బంది ఉండేవారు. ఇటీవల సామర్లకోట పోలీస్ స్టేషన్ సర్కిల్ కావడంతో ఒక సీఐతో పాటు ముగ్గురు ఎస్సైలు, ముగ్గురు ఏఎస్సైలు, ఏడుగురు హెచ్‌సీలు, 26 మంది పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ప్రజల రక్షణ దృష్ట్యా, ఉన్న సిబ్బందికి పనిభారం పెరగకుండా అదనపు సిబ్బంది నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ స్టేషన్‌లో మరో ఎనిమిది మంది సిబ్బంది కొత్తగా చేరనున్నారు. అయితే ఈ స్టేషన్ పరిధి పెరగడంతో సేవలకు ఇబ్బంది రాకుండా రూరల్ స్టేషన్ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. అదే ఆచరణలోకి వస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

కొత్తగా ఎనిమిది మంది సిబ్బంది



సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధి పెరగడంతో అదనంగా 8 మందిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వారు త్వరలో చేరే అయ్యే అవకాశం ఉంది. అప్పటి వరకూ ఆయా గ్రామాల్లోని మహిళా పోలీసుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం మంచిదే. అయితే దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి.

–కె.దుర్గాప్రసాద్, సీఐ, సామర్లకోట

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..



ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ఒకే మండలం పరిధిలోకి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చాం. చంద్రంపాలెం, పంద్రవాడ, పవర, అచ్చంపేట, గొంచాల, నవర, పి.వేమవరం, ఉండూరు, పనసపాడు, మాధవపట్నం, వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీతో పాటు మిగిలిన గ్రామాలు సామర్లకోట పోలీసు స్టేషన్ పరిధిలో ఉంటాయి.

–దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, సామర్లకోట

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకూ మన ప్రభుత్వం



గొల్లప్రోలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో 1, 2వ గ్రామ సచివాలయాల్లోని రంగప్ప చెరువు, పెదవీధిలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం పథకాల రూపంలో చేకూర్చిన లబ్ధిని వివరించారు. నగర పంచాయతీలోని వార్డుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. గడపగడపకూ నిర్వహించిన ప్రతి సచివాలయానికి రూ.20లక్షలను కేటాయించారని, వాటితో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియాతో తెలుగుదేశం పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ . వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు మేలు చేశారన్నారు. జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 175 స్థానల విజయమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ జాతర



కొండపల్లి గంగాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దొరబాబు, కళ దంపతులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే కొండపల్లి గంగాలమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కళ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ సభ్యుడు పోకనాటి నాగలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు వారికి ఘన స్వాగతం పలికి అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం గరగల ఉత్సవం, కోలాటం, బ్యాండ్ మేళాలతో అమ్మవారి ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, లక్కాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



పెద్దాపురంలో ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న ప్రొఫెసర్ తాతాజీ

పెద్దాపురం: ఆరోగ్యంపై ప్రతి విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అల్లు రామలింగయ్య హోమియో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.తాతాజీ అన్నారు. పెద్దాపురం వరహాలయ్యపేట యనలపు సూర్యారావు భవనంలో పట్టణ చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ రొంగల అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాతాజీ మాట్లాడారు. ఆహారం, ఆరోగ్యం, వ్యాయామం, నిద్ర అంశాలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అధిక శాతం నీటిని తాగడం ద్వారా చాలా రోగాలకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో బుద్ధా శ్రీనివాస్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, కూనిరెడ్డి అరుణ, రవికుమార్, అమత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

సంగీతంపై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని విశ్రాంత ఉద్యోగి బి.నాగమణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పాటలు, సంగీతాన్ని నేర్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

దుబాయి నుంచి క్షేమంగా స్వగ్రామానికి..



విలేకర్ల సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న లావణ్య

సామర్లకోట: జిల్లా మానవ హక్కుల సంఘం జోక్యంతో ఒక మహిళ దుబాయి నుంచి క్షేమంగా స్వగ్రామం చేరుకుంది. ఆదివారం స్థానిక మానవ హక్కుల సంఘం కార్యాలయంలో బాధితురాలు విలేకర్లకు తెలిపిన కథనం ప్రకారం.. డబ్బు సంపాదించాలని స్థానిక బలుసులపేటకు చెందిన బండా లావణ్య తొమ్మిది నెలల కిందట ఏజెంట్ సాయంతో దుబాయి వెళ్లింది. నాలుగు నెలలు పనిచేసిన తరువాత లావణ్యను ఇంటి యజమాని బాబా వేధింపులకు గురిచేయడంతో భర్తకు విషయం తెలిపింది. దాంతో భర్త సామర్లకోట పోలీసులను ఆశ్రయించగా ఫలితం లేకపోవడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్ ద్వారా సామర్లకోటలోని జిల్లా మానవ హక్కుల సంఘ నాయకులను కలిశారు. స్వదేశం వెళ్లి పోతానని చెప్పడంతో రూ. రెండు లక్షలు కట్టమని ఇంటి యజమాని డిమాండ్ చేశాడని లావణ్య చెప్పింది. సొమ్ము చెల్లించే పరిస్థితి లేదని చెప్పడంతో దుబాయిలోని పోలీసు స్టేషన్‌లో తనపై కేసు పెట్టారని ఆమె పేర్కొంది. ఈ విషయం తెలుసుకున్న మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మానవ హక్కుల సంఘ ఇంటర్నేషనల్ అధికార ప్రతినిధి పిట్లా అప్పారావుకు పరిస్థితిని వివరించారు. దుబాయిలో ఉన్న మానవహక్కుల సంఘ సభ్యుల సహకారంతో ఏజెంట్ ద్వారా రూ.రెండు లక్షలు కట్టించి, బాధితురాలు లావణ్యను క్షేమంగా సామర్లకోట తీసుకువచ్చారు. దాంతో లావణ్యతో పాటు భర్త నాగేశ్వరరావు, తల్లి దొణం కాంతంలు మానవహక్కుల సంఘ నాయకులకు ఆదివారం కృతజ్ఞతలు తెలియజేశారు. దుబాయి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని ఆమె తెలిపింది. ఈ సమావేశంలో మానవహక్కుల సంఘ నాయకులు కుంచే నానిబాబు, జత్తుక అప్పారావు, వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో సందడి



ఉప్పాడ సాగర తీరంలో పర్యాటకులు



బీచ్ రోడ్డులో నిలిచిన వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: రోజురోజుకూ భానుడు భగ్గుమంటున్నాడు. ఎండను భరించలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో జనం కాస్త ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళుతున్నారు. ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకుని సందడి చేశారు. దీంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలిగేశ్వరరావు సహా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇద్దాం



సూర్యారావుపేట బీచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు తదితరులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట గ్రామ పరిధిలోని సముద్రం ఒడ్డున మెగా బీచ్ క్లీనప్ కార్యక్రమాన్ని కాలుష్య నియంత్రణ మండలి, ధరిత్రి రక్షిత సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపులో భాగంగా స్వచ్ఛత జన్ భగీదరి– స్వచ్ఛత సాగరతీర పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టి బీచ్‌లో చెత్తను సేకరించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. ధరిత్రి రక్షిత సమితి సభ్యులు, విద్యార్థులు, వివిధ పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ శాఖ ఈఈ అశోక్‌కుమార్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నాగ నరసింహారావు, ధరిత్రి రక్షిత సమితి ప్రెసిడెంట్ సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత అడిషనల్ కమిషనర్ నాగ నరసింహారావు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించగా ధరిత్రి రక్షితి సమితి సభ్యుడు గోపరాజు కృష్ణమోహన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నాగ నరసింహారావు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత జలాలను అందించాలంటే ప్రతి విద్యార్థి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ అమ్మాజీ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ బాలాజీ, ధరిత్రి రక్షిత సమితి వైస్ ప్రెసిడెంట్ పోలిశెట్టి ఈశ్వరరావు, సూర్యారావుపేట పంచాయతీ కార్యదర్శి, సీపోర్టు, అదాని ఆయిల్స్, నగరపాలక సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కరప: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా విజ్ఞాన సముపార్జన సాధ్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు అన్నారు. వేళంగి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గణితంలో మెళకువలు, పేపర్ ఆర్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ శిబిరాలు ఉంటాయన్నారు. చక్కా నూకరాజు, గరగ కాశీ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

కాకినాడ సిటీ: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాకినాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, నాయకులు కోలా ప్రసాద్‌వర్మ, పెద్దాడ సుబ్బారాయుడు, కుక్కల పోతురాజు, తమ్మనపూడి సత్తిప్పనాయుడు, మేయ్యటి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిన అశ్వనిని అభినందిస్తున్న డాక్టర్ అన్నవరం

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం సత్కరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన గుత్తుల అశ్వని, ఎస్.రాజేశ్వరి, డి.భానుగంగా లక్ష్మిలకు, ప్రథమ సంవత్సరంలో వంశీ సందీప్, సీహెచ్ సునీత, వంశీ రాజేష్‌లను అభినందించారు. డాక్టర్ పితాని అన్నవరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ పితాని అన్నవరం తమ ట్రస్ట్ తరపున విద్యార్థులను సత్కరించి, నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. వైస్ ప్రిన్సిపాల్ ధనకృష్ణారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు డేగల శ్రీనివాస్, సీహెచ్ అప్పన్న, ఎర్రా విక్రమ్, సీహెచ్ నరసింహమూర్తి, ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సారా బట్టీ నిర్వాహకుడిపై కేసు

పెద్దాపురం: ఆర్‌బీ కొత్తూరులో సారా బట్టీ నిర్వహిస్తున్న వ్యక్తిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పెద్దాపురం ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ కేవీ స్వామి తెలిపారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉండడమే కాకుండా సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గెడ్డద వరప్రసాద్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేశామన్నారు. ఇదిలా ఉంటే స్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.సూర్యనారాయణ, డి.సువర్ణరాజులకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించిందన్నారు.

అలరించిన సంగీత విభావరి



సినీగీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

కాకినాడ కల్చరల్: స్థానిక డీమార్టు సెంటర్‌లోని శ్రీవిద్యాకాలనీ ఉద్యాన వనంలో ఆదివారం సాయంత్రం ఘంటసాల సంగీత పీఠం ఆధ్వర్యంలో స్వరార్చన పేరుతో ఏర్పాటైన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా పీఠం కార్యదర్శి పంపన దయానందబాబు మాట్లాడుతూ ఘంటసాల శతజయంతి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రతి 15 రోజులకు సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శ్రీవిద్యా కాలనీ పార్కులో చక్కని సంగీత కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని పీఠం గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. సందర్శకులను ఉత్సాహపరచడానికి సంగీత కచేరి ఏర్పాటు చేశామని శ్రీవిద్యాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యమూర్తి అన్నారు. కాలనీ నివాస సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వైడీ రామారావు పీఠం సేవలను కొనియాడారు. గాయకులు బాలు, రమణ తదితరులు ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమంలో పీఠం అధ్యక్షుడు కె.అచ్యుతరామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పేరుబాబు



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పేరుబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన దినవహి పేర్రాజు (పేరుబాబు) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బ్రాహ్మణ సంఘాలతో పాటు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమాచారం ఇచ్చారని ఆయన తెలిపారు. తొలి సారిగా బ్రాహ్మణ కార్పొరేషన్‌లో స్థానం లభించడంతో బ్రాహ్మణ సంఘ నాయకులు, సర్పవరం వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆయన ఆదివారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. డైరెక్టర్ పదవికి ఎంపిక చేయించినందుకు పేరిబాబు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన్ని కన్నబాబు అభినందించారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, జమ్మలమడక రామశర్మ, సర్పవరం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీ సారా రాజేష్, బ్రాహ్మణ సంఘ నాయకులు పోడూరు దుర్గాప్రసాద్, సూర్యప్రకాష్, ముంజులూరి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా సేవలు

కాకినాడ సిటీ: రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా సేవలందించే జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆల్‌ఇండియా మిల్లీ కౌన్సిల్ అని మిల్లీ శాఖ జిల్లా అధ్యక్షుడు ఎతిషామ్ ముల్లాహక్, కార్యదర్శి కాజా మొహిద్దీన్ శిఫ్టీలు తెలిపారు. ఆదివారం స్థానికంగా వారు విలేకర్లతో మాట్లాడారు. సమష్టి కృషి ఫలితంగా విజయవాడ నుంచి పవిత్ర హజ్ యాత్రకు మార్గం సుగమం అయ్యిందన్నారు. కేంద్ర మైనారిటీ శాఖ, కేంద్ర హజ్ కమిటీ వారి సాంకేతిక కారణాలతో ప్రతి హాజీపై రూ. 80 వేల అధిక భారం పడిందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా హజ్ యాత్రకు వెళ్లేవారిపై ఎటువంటి భారం పడకుండా రూ.14.21 కోట్లు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. ముస్లిం సమాజానికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

కాకినాడ క్రైం: జడ కాంక్రీట్ మిక్సర్‌లో చిక్కుకుని ఓ కార్మికురాలు గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రేచర్లపేటకు చెందిన డి.మరియారాణి (18) భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తోంది. స్థానిక దంటువారి వీధిలో ఓ భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఇసుక, కాంక్రీట్‌ను కలిపే మిక్సర్‌లో ఆమె జడ చిక్కుకుంది. ఈ ఘటనలో ఆ జుత్తు ఊడిపోవడంతో పాటు తలపై చర్మం లాగేసింది. క్షతగాత్రురాలిని జీజీహెచ్‌లో చేర్చారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసు నమోదు

కరప: చేతిపంపును చోరీ చేస్తూ ఇద్దరు పట్టుపడ్డారు. కరప పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన ఊయల వీరబాబు, జగన్నాథం ఏసులు కరప మండలం పెనగుదురులోని పంచాయతీ కార్యాలయం పక్కన పాలమ్మ చెరువుగట్టున ఉన్న చేతిపంపును ఊడతీసి పట్టుకెళ్తుండగా స్థానికులు స్పందించి పట్టుకున్నారు. నిందితులను కరప పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.